## క్లుప్తంగా

### ప్రజల హక్కులపై అవగాహన



మాగనూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రతి నెల చివరి రోజున గ్రామాలలో ప్రజలకు, గ్రామపెద్దలకు, యువకులకు, విద్యార్థులకు హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మన్నన్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలను ఏపుగా పెంచాలి



మద్దూరు: హరితహారం కోసం ఉపయోగించే మొక్కలను ఏపుగా పెంచాలని ఎంపీడీఓ నర్సింహారెడ్డి వన సేవకులకు సూచించారు. బుధవారం మండలంలోని పల్లెగడ్డతండాలో జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న 5వేల మొక్కలను వర్షకాలం నాటికి సిద్ధం చేయాలన్నారు.

### విద్యుదాఘాతంతో లాండ్రీషాప్ దగ్ధం

మరికల్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల లాండ్రీ షాప్ దగ్ధమైన ఘటన బుధవారం ధన్వాడలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ వీధిలో చాకలి రాజుకు చెందిన లాండ్రీ, డ్రైక్లీనింగ్ షాప్‌కు షార్ట్‌సర్క్యూట్ కావడంతో వినియోగదారుల దుస్తులతో పాటు షాప్‌లో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. రూ. 50వేల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు.

### 2 నుంచి వేసవి క్రీడాశిబిరాలు

నారాయణ పేట ఎడ్యుకేషన్: రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆదేశాల మేరకు నారాయణ పేట జిల్లాలోని దామరగిద్ద, గుండుమాల్, మద్దూర్, మక్తల్ మండలాల్లో అథ్లెటిక్స్ వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు మే 2వ తేదీ నుంచి వేసవి క్రీడాశిబిరాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు



మక్తల్: మండలంలోని దాసర్‌పల్లి గ్రామంలో బుధవారం వేంకటటేశ్వర దేవాలయంలో జరుగుతున్న బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. 1098కు ఫోన్ చేయడంతో అధికారులు గ్రామానికి చేరుకోని బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికను రెస్క్యూ చేసి నారాయణపేట సీడబ్ల్యూసీ ముందు హాజరు పరుచి బాలసదనంలో ఉంచారు. అధికారులు అమ్మక్క, విజయ్‌కుమార్, విద్య, మహేష్, పోలీసులు తదితరులు ఉన్నారు.

### నేడు ఉచిత వైద్యశిబిరం



నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం చిన్న పిల్లల ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ హరి నారాయణ్ బట్టడ్ అన్నారు. పట్టణంలోని నిత్య హాస్పిటల్ లో 3రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చిన్న పిల్లల వైద్య నిపుణురాలు సునిది గందె పర్యవేక్షణలో చికిత్స, మందుల పంపిణీ చేస్తారన్నారు. అనంతరం వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రముఖ జనరల్ ఫిజిషియన్ కార్తీక్ కుమార్ గందె, మోల్గాన్ జనార్దన్, ఎక్సోటీ బాలాజీ, రవిగౌడ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

### తెలుగు కవిత్వాన్ని రక్షించిన శ్రీశ్రీ

వనపర్తి విద్యావిభాగం: అభ్యుదయ కవితా వైతాళికుడు విప్లవ కవిత చోదకుడు శ్రీశ్రీ 115 జయంతి వేడుకలను మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# సర్కార్ బడిలో మెరిసిన విద్యాకుసుమాలు

● టాపర్లుగా నిలిచిన బాలికలు విద్యార్థులు



మద్దూర్ విద్యార్థులను, ఉపాధ్యాయులు అభినందిస్తున్న అడిషన్ కలెక్టర్ సంచిత్ గగ్వార్

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో సర్కార్ బడిలో చదివిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడిలో మార్కులు సాధించారు. కోస్గి పట్టణానికి చెందిన మిట్టి నిహారిక 572/600 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. కోస్గి మండలంలో మొత్తం 442 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 419 మంది పాసయ్యారు.

■ మద్దూరులోని ఎస్సీ గురుకుల విద్యార్థిని ఏ.మహేశ్వరి 566/600 సాధించి జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఏ.శశాంక్ 561/600 మార్కులు సాధించి జిల్లాలో 3వ స్థానంలో నిలిచాడు. కేజీబీవీ పెదిరిపాడ్ విద్యార్థిని కే. లక్ష్మి 548 మార్కులు సాధించింది. మద్దూరు బాలుర ఉన్నత పాఠశాల 97.4 శాతం ఉత్తీర్ణత సాధించడంతో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, అడిషన్ కలెక్టర్ సంచిత్‌గగ్వార్‌లు విద్యార్థులను, ఉపాధ్యాయులను సన్మానించారు.

■ నర్వ కస్తూర్బా గురుకుల పాఠశాల తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. మండల టాపర్‌గా తెలుగు మీడియంలో యాంకి చంద్రకళ 555/600, ఇంగ్లిష్ మీడియంలో కేజీబీవీ విద్యార్థిని కే.అమృత 550/600 మార్కులు సాధించడంతో ప్రిన్సిపాల్ శిరీష అభినందించారు.

■ నర్వ మండలంలోని పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పాథర్చేడ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 13 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించినట్లు హెచ్ఎం కృష్ణ తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో 550/600 మార్కులతో అమృత మండల రెండో టాపర్‌గా నిలిచిందన్నారు.

■ ఊట్కూర్ మండలంలోని పులిమామిడి కేజీబీవీలో 48 మంది విద్యార్థులకు గాను 48 మంది ఉత్తీర్ణులయ్యారు. సంగీత 544/600,జయశ్రీ 540/600 మార్కులు సాధించినట్లు ఎస్ఓలక్ష్మితెలిపారు.

■ మాగనూర్ మండల టాపర్‌గా బి.నిరంజని 540/600 మార్కులతో నిలిచింది.

■ కొత్తపల్లి మండలంలోని నిడ్జింత, భూనీడు ఉన్నత పాఠశాలల్లో 135 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయగా 127 మంది ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి ఆంజనేయులు తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో వీ.శిరీష 535/600 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

■ ధన్వాడ మండలంలో కిష్టాపూర్, కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాల్లో వందశాతం ఉతీర్ణత సాధించారు. ప్రేమ్‌కుమార్ 557, శ్వేత 532, శిరీష 518 మార్కులు సాధించారు.

■ మరికల్ మండల టాపర్‌గా శ్రీవాణి 577,చారిత 573,శ్రీవాణి 563,అక్షయ 558 మార్కులుసాధించారు.కస్తుర్బాలోసాయిరక్షిత 563 టాపర్‌గానిలిచింది.

■ దామరగిద్ద మండలంలో మొత్తం 531 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా, 530 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో మహేష్, రితేష్‌లు 558/600 మార్కులు సాధించి మండల టాపర్లుగా నిలిచారు.

■ మక్తల్ మండలంలో 1306 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 1214 మంది ఉత్తీర్ణులయ్యారు. గుడిగండ్లలో 27 మంది పరీక్షలు రాయగా, 27 మంది పాసయ్యారు.

■ మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.నిరంజని 540 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. అదే పాఠశాలకు చెందిన హేమలత 534తో ద్వితీయ స్థానం సాధించింది. మొత్తం 245 విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 244 మంది ఉత్తీర్ణత సాధించి 99.6 శాతం సాధించారు.



శ్రీవాణి(577)



అనుషా -574



చారిత(573)



సాయిరక్షిత(563)



నాగవేణి 550



సవిత (547/600)

# ఘనంగా బసవేశ్వర జయంతి

సాక్షి, నెట్‌వర్క్: ఊట్కూరు మండలంలో బుధవారం ఘనంగా బసవేశ్వరస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చౌరస్తాలో బసవేశ్వరస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షులు బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, లింగాయత్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

■ మాగనూర్ మండల కేంద్రంలోని వర్కూర్ క్రాస్ రోడ్డు దగ్గర వీరశైవలింగాయత్ ఆధ్వర్యంలో బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాజుల ఆశిరెడ్డి, గురుప్రసాద్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

■ మరికల్‌లో వీరశైవ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో చౌరస్తాలో బసవేశ్వర స్వామి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో బసంత్, శేఖర్, వీరేష్‌జగదీశ్, శేట్టి మహేష్, మల్లికార్జున్, జయంతి, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

■ మద్దూరు పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో మఠం సిద్రామయ్య నివాసంలో బసవేశ్వరుని చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రాంచందర్, తహసీల్దార్ మహేష్‌గౌడ్, బాబుస్వామి, మహేష్, మల్లికార్జున్, రవీందర్, సురేష్, ప్రశాంత్, మహేష్ పాల్గొన్నారు.

■ కోస్గి పట్టణంలో వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బసవేశ్వర జయంతి వేడుకలు మల్లికార్జున దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి విద్యసాగర్ వీరమల్లేష్, నాగరాజు, మల్లికార్జున్, తదితరులు ఉన్నారు.

■ సరాఫ్ బజారులో గల శ్రీబసవేశ్వర ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, అనంతరం ఆలయ శిఖరంపై పతాకావిష్కరణ చేపట్టి ఆలయ ఆవరణలో స్వామివారి డోలారోహణం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి చిత్రపటంతో కాడెద్దులతో ఊరేగింపు నిర్వహించారు. డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

■ వీర శివలింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శివలింగేశ్వర దేవాలయంలో బసవేశ్వర చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

■ కోస్గి పట్టణంలోని మల్లికార్జున దేవాలయంలో ఘనంగా నిర్వహించారు.



ఊట్కూరులో బసవేశ్వరస్వామి జయంతి ఉత్సవాలలో పాల్గొన్న నాయకులు



మాగనూర్‌లో..



మరికల్‌లో ..

# ప్రజలు చైతన్య వంతులుగా ఉండాలి



మక్తల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: గ్రామాల్లో ప్రజలు చైతన్యవంతులుగా ఉండాలని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం మక్తల్‌లో ప్రత్యేక చైతన్య కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టం తనపని తాను చేస్తుందన్నారు. అధికారులు చేసే పని అధికారులు చేయాలని కోరారు. 2006 ప్రకారం పెళ్లి వయస్సు 18 ఏళ్లు అమ్మాయికి, 21 సంవత్సరాలు అబ్బాయికి ఉండాలన్నారు. దాసర్‌పల్లిలో ఒక వివాహం అడ్డుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, సీడీపీఓ సరోజిని మట్ట, లీగల్ సెల్ కన్వీనర్ కవిత, విజయ్‌కుమార్, చంద్రకాంత్‌గౌడ్, రవికుమార్, అశోక్‌గౌడ్, విద్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

## మేడే జయప్రదం చేయండి




మరికల్/ధన్వాడ: మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మే డే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు భాను ప్రకాష్, బాలరాజ్‌లు మాట్లాడుతూ మేడే వేడుకలను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాబురావు, నరసింహులు, కతలప్ప, రాము పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర టీయూసీఐ ఆధ్వర్యంలో మేడే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ జిల్లా నాయకులు యాదగిరి మాట్లాడారు. కార్యక్రమంలో నరసింహ, రామచందర్, సాయిలు, ఇస్మాయిల్, నరసింహులు, ప్రభంజన్, నరేష్, రాము, కిష్టప్ప,రాములు పాల్గొన్నారు.

# మహేశ్వరి కుటుంబానికి అండగా ఉంటాం



మహేశ్వరి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి

మాగనూర్: గద్వాల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మహేశ్వరి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గురువలింగంపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఫోన్ ద్వారా గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని సంప్రదించి తదుపరి కార్యాచరణపై అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో మరణించిన వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరారు. మహేశ్వరి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## ముగిసిన బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ గ్రామంలో మూడు రోజులుగా బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో తొమ్మిదిచోట్ల బొడ్రాళ్లు ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# కారు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు



ప్రమాద స్థలంలో క్షతగాత్రులకు తరలిస్తున్న స్థానికులు

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామం అంతర్రాష్ట్ర చెక్కుపోస్ట్ సమీపంలో కారు, బైక్ ఢీకొన్ని ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఉట్కూర్ గ్రామానికి చెందిన వ్యక్తి కారును నారాయణపేట వ్యక్తులు అద్దెకు తీసుకొని గుల్బర్గకు బయలుదేరారు. ఉదయం 8గంటల సమయంలో కాన్‌కుర్తి సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న చెక్లాస్‌పల్లి బుడ్డప్పకు తీవ్ర గాయాలయ్యాయి. బైక్‌పై ఉన్న మారో వ్యక్తి కాన్‌కుర్తికి చెందిన భీమప్పకు స్వల్ప గాయాలయ్యాయి. బుడ్డప్పను నారాయణపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## తీగలపల్లిలో ఆధ్యాత్మిక శోభ

నవాబుపేట: మండలంలోని తీగలపల్లిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజులుగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వేద మంత్రోచ్చారణల నడుమ ఆంజనేయస్వామి, ధ్వజస్తంభం, నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠించారు. అదే విధంగా ఇప్పోనిబావి గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహం, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు నారాయణ, భీమయ్య, చెన్నయ్య, జంగయ్య, బాలకిష్టయ్య, నారాయణగౌడ్, ఆశన్న, ఇప్పోనిబావి రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

## అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న ఆదిత్యపరాశ్రీ

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి అంబాత్రయ క్షేత్ర వ్యవస్థాపకులు అధ్యాత్మిక పరిశోధకులు డాక్టర్ అదిత్యపరాశ్రీ గురువుగారు, శ్రీ మని ప్రపంచమ సిద్ధిలింగ పశ్చిమాద్రి సంస్థాన విరక్తమఠం పీఠాధిపతులు హాజరయ్యారు. బుధవారం సుకుంలమ్మ ఆలయం నుంచి బైక్ ర్యాలీతో అయ్యప్ప ఆలయానికి చేరుకొని లలితా త్రిపుర, నవగ్రహాల యంత్ర ప్రతిష్ఠ, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో హిందూ జాగృతం సభ్యులు, ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం సభ్యులు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

మహబూబ్‌నగర్ క్రైం: వేసవి సెలవుల్లో మైనర్లు ద్విచక్ర వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలను అరికట్టేందుకు జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ విభాగం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఎస్పీ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన కేసుల్లో వారి తల్లిదండ్రులను ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడపడం అనేది పూర్తిగా బాధ్యతతో కూడిన చర్య అని అన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం



గోపాల్‌పేట: మండలంలోని చాకల్‌పల్లి గ్రామానికి చెందిన విద్యావతి, నర్సింగాయపల్లికి చెందిన అనసూయ అంగన్‌వాడీ టీచర్లు 65 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారికి బుధవారం మండల కేంద్రంలో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారిణి సుధారాణి హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్‌కు ఎన్నో బాధ్యతలు ఉంటాయని, సర్వీస్‌లో సుమారు నలభై ఏళ్లకు పైగా ఉండి కష్టపడి సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఇద్దరిని సన్మానించారు. ప్రాజెక్టు అధికారిణి హజీరాబేగం, సూపర్‌వైజర్ వసంత, పోషణ అభియాన్ బీసీ శేఖర్, మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# అంకిత భావంతో పని చేయాలి



ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు

వనపర్తిటౌన్: ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని వనపర్తి ఆర్టీసీ డీఎం వేణుగోపాల్ అన్నారు. వనపర్తి ఆర్టీసీ డిపోలో కండక్టర్లు మహేహేశ్వర్ గౌడ్, వి. శ్రీనివాసులు, డ్రైవర్ కె. శ్రీనివాసులు, కంట్రోలర్ వీఎస్ చారి ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆర్టీసీ డిపోలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో మూడు దశాబ్దాల పాటు సేవలు అందించి ప్రభుత్వ రంగ సంస్థలో కుటుంబ సభ్యుల్లా మమేకం అయ్యారని, పదవీ విరమణ బాధ కలిగించిన ఉద్యోగ జీవితంలో తప్పదన్నారు. కార్యక్రమానికి హాజరైన సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్, జిల్లా సమన్వయకర్త బైరోజు చంద్రశేఖర్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ వేణుగోపాల్, డిపో సిబ్బంది, మెకానిక్ స్టాఫ్, తదితరులు, వారి కుటుంబ సభ్యులు ఉద్యోగ విరమణ పొందిన వారిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ దేవేందర్, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



హన్వాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని డీసీసీ జనరల్ సెక్రెటరీ టంకర కృష్ణయ్య యాదవ్, మండల అధ్యక్షుడు మహేందర్ అన్నారు. బుధవారం హన్వాడ - దొర్రితండా బీటీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చొరవతో దొర్రితండా బీటీరోడ్డు నిర్మాణానికి ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు రూ. 2.24 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చడంతో పాటు ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ ధర్మానాయక్, నాయకులు యాదవరెడ్డి, కిషన్ నాయక్, రాజు, బాబునాయక్, వినోద్ పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలతోనే గుర్తింపు



కమాండెంట్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఎర్రవల్లి: ఉత్తమ సేవలతోనే ప్రతి ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని.. తెలంగాణ ప్రత్యేక పోలీస్ విభాగంలో పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య ఎన్నో కఠినమైన విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్నారని పదో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ జయరాజు అన్నారు. బుధవారం మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన కమాండెంట్ పదవీ విరమణ సభకు ఆయన హాజరై అధికారులతో కలిసి కమాండెంట్ దంపతులకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1984లో ఎపిఎస్పీ విభాగంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన ఆయన దాదాపు 41 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రత్యేక పోలీస్ విభాగంలో వివిధ పదవులను అలంకరించి వృత్తిలో ఎలాంటి మచ్చ లేకుండా సేవలిందించారని అన్నారు. ఎన్నో కఠినమైన ప్రదేశాలతో పాటుగా యాంటీ నక్సల్స్ ఏరియాలలో కూడా ఆయన ఎంతో చాకచక్యంగా విధులు నిర్వహించారన్నారు. ఎంతో మంది సీఎంలు, మంత్రుల దగ్గర భద్రతా విభాగంలో ఉంటూ ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఆయన పనిచేశారని అన్నారు. వివిపి, వివిఐపి ల భద్రత విధులను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ కమాండెంట్ వేణుగోపాల్, అసిస్టెంట్ కమాండెంట్ లు నరేందర్‌రెడ్డి, పాణి, ఆర్ఐ లు రాజు, రాజారావు, రమేష్‌బాబు, శ్రీదర్, పటాలం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ఆత్మకూర్: స్వామి వివేకానంద సేవా సమితి ఆత్మకూర్, వాగ్దేవి జూనియర్ కళాశాల వనపర్తి వారి ఆధ్వర్యంలో స్థానిక సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో బుధవారం ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈనెల 1వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 98484 56391, 77801 79152 నంబర్లకు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్వప్న, బాలు, సంతోష్, మ్యాడం శ్రీను, రవి, శ్రీనివాసరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన చిన్నారెడ్డి

వనపర్తి రూరల్: మండలంలోని మెట్టుపల్లి పెట్రోల్ పంపు దగ్గర కిష్టగిరి గ్రామానికి చెందిన మిద్దెల మాసన్న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బుధవారం పలు వివాహ కార్యక్రమాలకు హాజరై అటుగా వెళ్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి స్పందించి తన వాహనంలో అతన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మానవత్వం చాటుకు జి చిన్నారెడ్డికి కిష్టగిరి గ్రామస్తులు శాలువాతో సన్మానించారు.

## వృద్ధులకు కళ్లద్దాల పంపిణీ

జడ్చర్ల టౌన్: సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆర్ఎస్‌డబ్ల్యూఏ వృద్ధాశ్రమంలో ఆరుగురికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఇటీవల ఆశ్రమంలో నిర్వహించిన కంటి చికిత్స శిబిరంలో కళ్లద్దాలు అవసరమైన వారిని గుర్తించి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు నయీమొద్దీన్, సభ్యులు శంకర్‌బాబు, బుచ్చిరెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.